# బీఆర్ఎస్ గూటికి ప్రదీప్

- సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరిక
- కాంగ్రెస్‌లో బీసీలకు స్థానం లేదని ఆగ్రహం



సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న ప్రదీప్‌కుమార్‌గౌడ్

దేవరకద్ర, నవంబర్ 6 : టీపీసీసీ కార్యదర్శి కాటం ప్రదీప్ కుమార్‌గౌడ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ గూటికి చేరారు. సోమవారం దేవరకద్రలో నిర్వహించిన ప్రజా ఆశీర్వద సభలో సీఎం కేసీఆర్ సమక్షంలో ఆయన, అనుచరవర్గం గులాబీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గంలో కారు గుర్తును గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. కరుడుగట్టిన కాంగ్రెస్ నాయకులను రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. 35 ఏండ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన తనకు తీరని అన్యాయం చేశారని ఆవేదన చెందారు. అందుకే హస్తం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలో తీసుకొచ్చేందుకు రాహుల్ గాంధీ పాదయాత్రచేస్తే తాను ముందుండి జనసమీకరణ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ జెండా మోయని వారికి జిల్లా అధ్యక్ష పదవులు ఇవ్వడమే కాకుండా, పార్టీ టికెట్ కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. డబ్బులున్న నేతలకే పార్టీలో టికెట్లు కేటాయిస్తున్నారని, రేవంత్‌రెడ్డి ఉన్నంత కాలం కాంగ్రెస్‌లో బీసీ వర్గాలకు సముచిత న్యాయం ఉండదన్నారు. అందుకే బీసీ నేతలంతా పార్టీని వీడాలని సూచించారు. దేవరకద్ర నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను ఓడించడమే తన లక్ష్యమన్నారు. ఆయన వెంట నాయకులు కేబీఆర్ గౌడ్, కుర్వ రాందాస్, భగవంత్ గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

# దేవరకద్రకు వరాల జల్లు

దేవరకద్ర, నవంబర్ 6: ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం దేవరకద్ర నియోజవర్గకేంద్రంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో దేవరకద్రకు సీఎం కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. నియోజకవర్గ కేంద్రంలో ఆర్వోబీ నిర్మాణం చేపట్టడంతో రైల్వే అధికారులు గేట్ మూసివేశారని, అదే విధంగా దేవరకద్ర మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చాలని ఎమ్మెల్యే ఆల కోరారు. స్పందించిన సీఎం కేసీఆర్ వచ్చేది మన ప్రభుత్వమేనని అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని సీఎం చెప్పడంతో సభా ప్రాంగణం చప్పట్లు, కేరింతలతో మార్మోగింది.

# గులాబీ జోష్

- ఆకట్టుకున్న కళాకారుల గానాలు



కేసీఆర్ ముఖ చిత్రంతో బాలుడు



మధుప్రియ గానానికి నృత్యం చేస్తున్న ఎంపీపీ గుంతమౌనిక

కొత్తకోట, నవంబర్ 6 : దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో సోమవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజాఆశ్వీరాద సభలో గులాబీ జోష్ నెలకొన్నది. సభా ప్రాంగణంలో కళాకారులు మనుకోట ప్రసాద్, మధుప్రియ ఆటపాటలకు కార్యకర్తలు చిందులు వేశారు. కుర్చీలో నిలబడి కార్యకర్తలు అభివాదం చేస్తూ సందడి చేశారు. సభా ప్రాంగణానికి సీఎం కేసీఆర్ ముఖచిత్రంతో పలువురు వచ్చారు. మధుప్రియ గానానికి కొత్తకోట ఎంపీపీ గుంతమౌనిక నృత్యం చేశారు.

# అలరించిన ధూంధాం

- ఫ్లెక్సీలతో నిండిన సభా ప్రాంగణం
- హోరెత్తిన బీఆర్ఎస్, కేసీఆర్ నినాదాలు




గద్వాల ప్రజా ఆశీర్వాద సభలో పాటపాడుతున్న కళాకారులు

గద్వాలటౌన్, నవంబర్ 6 : గద్వాలగడ్డ మీద గులాబీ జెండా..ఎగరాలి గుండెల నిండా... ఎత్తుర ఎత్తు గులాబీ జెండా.. అంటూ కళాకారులు సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు..అందుకు అనుగుణంగానే సభకు వచ్చిన ప్రజలు గొంతు కలుపుతూ నృత్యాలు చేశారు.. మరో పక్క బీఆర్ఎస్...కేసీఆర్ నినాదాలు సభా ప్రాంగణంలో మార్మోగాయి.. అలాగే కళాకారుడు, గిడ్డంగుల రాష్ట్ర చైర్మన్ దివంగత సాయిచంద్‌ను కళాకారులు స్మరించుకున్నారు.. ప్రముఖ గాయకుడు, రచయిత మిట్టపల్లి సురేందర్ ప్రత్యేక ఆకర్షణగా నిలచి ప్రజలను ఉత్తేజపరిచారు...

**నిరుత్సాహ పడని అభిమానం..**

గద్వాల ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. సీఎం రాక ఆలస్యమైనా వేలాదిగా తరలి వచ్చిన అభిమాన జనసందోహంలో ఏమాత్రం నిరుత్సాహం కనబడలేదు. తమ నేత వస్తున్నాడన్న ఉత్సాహం వారిలో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఐదు గంటలపాటు సభా ప్రాంగణమంతా జై కేసీఆర్.. బండ్ల కృష్ణన్న..బీఆర్ఎస్ నినాదాలతో మార్మోగింది. ఈసారి కూడా తమ మద్దతు బీఆర్ఎస్‌కే అంటూ ముక్తకంఠంతో నినదించారు నియోజక వర్గ ప్రజలు.

### కూలీ పనులు మాని సీఎం సభకు వచ్చా..



నా భర్త తాపీ మేస్త్రీ. మాకు ఎలాంటి పొలంలేదు. నేను రోజూ కూలీ పనికి వెళ్తా. మా మామయ్యకు పింఛన్ వస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం అంటే మా కుటుంబానికి అభిమానం. సీఎం కేసీఆర్ సార్‌ను చూడడానికి కూలీ పని మాని చంటి పిల్లాడిని వెంటేసుకుని సభకు వచ్చా. మళ్లీ ఎమ్మెల్యేగా కృష్ణమోహన్‌రెడ్డి, సీఎంగా కేసీఆర్‌ని చూడడం ఖాయం. ఇందులో అనుమానమే లేదు.

**-జ్యోతి, గద్వాల..**

### ట్రైసైకిల్‌పై సభకు వచ్చా..



నాకు దివ్యాంగ పింఛన్ వస్తుంది. పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచి దివ్యాంగులపై తనకున్న అభిమానాన్ని సీఎం కేసీఆర్ చాటుకున్నాడు. పింఛన్‌ను గత ప్రభుత్వాలు ఏమాదిరిగా ఇచ్చాయో అందరికీ తెలిసిందే. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టడం మాత్రం ఖాయం. సభకు బ్యాటరీ ట్రైసైకిల్ మీద వచ్చా.

**-నాగరాజు..దివ్యాంగుడు, సుల్తాన్‌పురం, కేటీదొడ్డి మండలం.**

### స్వచ్ఛందంగా మీటింగ్‌కు వచ్చా..



నాకు పింఛన్ వస్తుంది. సీఎం కేసీఆర్‌ను చూడడానికి మా మోటార్‌సైకిల్‌పై స్వచ్ఛందంగా కొడుకుతోసహా సభకు వచ్చాను. బీఆర్ఎస్ ప్రభుత్వం రకరకాల పథకాలతో అందరికీ మేలు చేస్తోంది. ఏ ప్రభుత్వం కూడా ఈ విధంగా పాలన చేయలేదు. అందరూ మరోసారి ఈ ప్రభుత్వాన్ని ఆదరించాలి.

**-వడ్ల లక్ష్మీదేవమ్మ, గద్వాల..**

### ఈ ప్రభుత్వం ఎవరికి తక్కువ చేసింది?



ఈ ప్రభుత్వం ఎవరికీ తక్కువ చేయలేదు. ప్రతి కుటుంబం ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిందనే విషయాన్ని ఎవరూ కాదనలేరు. గత ప్రభుత్వాలు ప్రజలను పట్టించుకున్న పాపానపోలేదు. ఇంతకన్నా మంచిగా చేసే ప్రభుత్వం ఏదీ కూడా రాదు. మరోసారి బీఆర్ఎస్ గెలుపును ఆపడం ఎవ్వరితరం కాదు.

**-తాయప్ప, ఉమిత్యాల, కేటీదొడ్డి, మండలం..**

### ముసలోళ్లకు పెద్దదిక్కు కేసీఆర్



తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సారు ముసలోళ్లకు పింఛన్లు ఇస్తున్నందుకు చాలా సంతోషంగా గడుపుతున్నాం. కొన్ని ఇండ్లల్లో పిల్లలే ముసలోళ్లను పట్టించుకోరు. అలాంటిది రాష్ట్రంలోని ముసలోళ్లు, దివ్యాంగులకు పింఛను ఇచ్చి కాపాడుతున్న కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. ఆయనను చూడాలని, ఆయన మాటలు వినాలని దేవరకద్ర సభకు వచ్చినం.

**-బాలమ్మ, రేకులంపల్లి, కౌకుంట్ల మండలం.**

### మంచితనానికి మారుపేరు కేసీఆర్



తండాలు, చిన్న గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయి. గతంలో పాలించిన పాలకులు చిన్న పల్లెలను పట్టించుకోలేదు. కేవలం ఓట్ల సమయంలో ఓట్లు అడగడానికి వచ్చిండ్రంటే, తిరిగి మళ్లీ ఓట్లకే వచ్చే వారు. చిన్న పల్లెలను పంచాయతీలుగా మార్చిన కేసీఆర్‌కు అండగా ఉంటాం. అందుకే సీఎం కేసీఆర్‌ను చూడటానికి దేవరకద్రకు వచ్చాం.

**-మణెమ్మ రేకులంపల్లి , కౌకుంట్ల మండలం**

### సీఎంను చూడటానికి వచ్చా..



స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి ఇప్పటిదాకా చాలా మంది సీఎంలను చూసిన, కానీ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చావడానికి సిద్ధపడి దీక్షకు పూనుకుని చివరకు రాష్ట్రాన్ని సాధించారు. అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పగలూ రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం పనిచేస్తున్నారు. అలాంటి మహా మనిషిని చూడాలని దేవరకద్ర సభకు వచ్చిన...

**-రాములు, పేరూర్ , కౌకుంట్ల మండలం**

### రైతుల పాలిట దేవుడు కేసీఆర్



సీఎం కేసీఆర్ రైతులకు రైతు బంధు ద్వారా పెట్టుబడి సాయం అందజేయడంతో చాలా వరకు సాగు పెరిగింది. నాకు ఉన్న రెండున్నర ఎకరాల సాగుకోసం పెట్టుబడికి అప్పులు చేసేవాడిని. కేసీఆర్ పెట్టుబడి సాయం ఇచ్చినప్పటి నుంచి అప్పులు లేకుండా పంట పండించుకుంటున్నాను. పంట ధాన్య కూడా ప్రభుత్వమే కొనడంతో రైతులకు ఇబ్బందులు తగ్గినవి. రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న కేసీఆర్ సారు మాటలు వినాలని మీటింగ్‌కు వచ్చాను.

**-ఆంజనేయులు, కౌకుంట్ల , మండలం**

### కేసీఆర్ మహాసేవకుడు



సీఎం కేసీఆర్ వస్తున్నారని మా గ్రామం నుంచి చాలామంది వచ్చాం. సీఎంను చూస్తే మా కు అంతులేని ధైర్యం వస్తుంది. కేసీఆర్ చేసిన పనులు చూస్తే ఆనందంతో కళ్లలో నీళ్లొస్తాయి. ఆయన చేసిన మేలు పది తరాలు మర్చిపోవు. అంతలా రైతులకు సేవ చేస్తున్నాడు. కొందరు నాయకులు హస్తంకు ఓటెయ్యండి అంటున్నారు. వాళ్లకు ఒక్కటే చెప్పినం. మా ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ తప్పా వేరే పార్టీ ఓటేయ్యం అని చెప్పినం. ఆయన మహా సేవకుడు మళ్లీ ఆయన పాలనే రావాలి.

**-రాముడు, పావనంపల్లి , మల్దకల్ మండలం**

### బీఆర్ఎస్ పాలన భేష్



బీఆర్ఎస్ పాలన, ఎమ్మెల్యే బండ్ల కృష్ణన్న పనితీరు చాలా బాగుందని చెప్ప డానికి గద్వాలలో జరిగే మార్పును చూస్తేనే తెలుస్తున్నది. నేను ఇంటర్‌మీడియట్ చదివేటప్పుడు మనశ్శాంతి కోసం కాసేపు సరదాగా పార్కులకు వెళ్దామంటే ఒక్కటంటే ఒక్కటి లేకుండే. కానీ ఇప్పుడు అభివృద్ధి చూస్తుంటే హైదరాబాద్ గుర్తొస్తుంది. సంగాల పార్కు అయితే సూపర్‌గా ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ ఇలాగే కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్సే గెలవాలి.

**-మల్లేశ్, గొర్లఖాన్‌దొడ్డి , గట్టు మండలం**

### మళ్లీ కేసీఆర్ సారే రావాలి



మోసం చేసే పార్టీ నాయకుల మాటలు నమ్మితే మళ్లీ పాత రోజులు వస్తాయి. అందుకని మళ్లీ కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి. ఒక్క వర్గానికి కాకుండా ప్రతి ఒక్కరికీ మేలు చేయాలనే ఆయన ఆలోచన గొప్పది. అలాంటి గొప్ప నాయకుడికి ఓటేస్తేనే మనకు మేలు జరుగుతుంది. అందుకని మళ్లీ కారు గుర్తుకు ఓటేసి కృష్ణమోహన్‌రెడ్డిని గెలుపించుకుంటాం.

**-తిమ్మక్క, నీలిపల్లె , ధరూర్ మండలం**

### పక్క రాష్ట్రం పరిస్థితి చూస్తున్నాం



మాది తెలంగాణ రాష్ట్రం చిట్ట చివరి గ్రామం. మా పొలాలకు ఆనుకొని కర్ణాటక రాష్ట్ర ప్రజల పొలాలు ఉన్నాయి. వారి పరిస్థితి చూస్తుంటే కళ్లలో నీళ్లొస్తున్నాయి. డబ్బున్న వాళ్లకి కేసీఆర్ విలువ తెలీదు. మాలాంటి వ్యవసాయదారులకే తెలుస్తుంది. మేము పగలు పొలాలు నానా కట్టుకుంటుంటే, వాళ్లేమో పాపం రాత్రి వేళలో పొలం బాట పడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లేస్తే మాకు ఆ పరిస్థితే వస్తుంది. అందుకని ఓటు వేసే టప్పుడు వళ్లు దగ్గర పెట్టుకుని కారు గుర్తుకు ఓటేస్తాం.

**-ప్రభు ఆచారి, గువ్వలదిన్నె, కేటీదొడ్డి మండలం**